
నిబంధనలు ఎంత గట్టిగా ఉన్నా వాటిని బేఖాతరు చేసే దారులూ ఉంటాయి. మూడేళ్లకు పైగా జిల్లా లో పనిచేసిన ప్రభుత్వ అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలి. అయితే తమకు ఇష్టులనీ, చెప్పిన పని చేస్తారనీ, విశ్వసనీయంగా మసలుకుంటారనీ వైసీపీ నాయకులు అనుకున్న అధికారులు మాత్రం లూప్‌లైన్ విధానంతో జిల్లాలోనే ఉండిపోయారు. పేరుకు ఎన్నికల విధులు ఈ పోస్టుల్లో ఉన్నవారికి ఉండవు కానీ, వీరు పాత అనుభవంతో జిల్లాలో అధికార పార్టీకి అనుకూలంగా చక్రం తిప్పుతారన్నమాట. ఇట్లా దాదాపు 20 మంది అధికారులు జిల్లాలో తిష్టవేసుకుని ఉన్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



- ఏళ్లుగా జిల్లాలో తిష్ట వేసిన అధికారులు
- కోడ్ వచ్చినా లూప్‌లైన్ పేరుతో జిల్లాలోనే..

వదల బొమ్మాళీ..

బదిలీ చేసినా వెళ్లని బాలాజీ

పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, వి.కోట ప్రాంతాల్లో ఇన్‌చార్జి ఎంపీడీవోగా సుదీర్ఘకాలం పనిచేసిన బాలాజీ కొన్నాళ్లుగా జడ్పీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. మూడేళ్లకుపైగా జిల్లాలో పనిచేసినందున నిబంధనలకు అనుగుణంగా నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. జిల్లాను వదిలి వెళ్లడం ఇష్టం లేని ఈయన బదిలీ చేసినా నెల్లూరులో జాయిన్ కాలేదు. మాజీ మంత్రి సోమిరెడ్డి ఇలా విధుల్లో జాయిన్ అవ్వని ముగ్గురు అధికారుల మీద ఆ మధ్య ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు కూడా చేశారు. బాలాజీ బదిలీ ఫైల్ కలెక్టర్ వద్దనే ఉన్నట్లు సమాచారం.

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో మూడేళ్ల పాటు సర్వీసు పూర్తి చేసుకున్న అధికారులు కచ్చితంగా బదిలీ అవ్వాల్సి ఉంది. కానీ, జిల్లాలో కొందరు అధికారులు జిల్లాను వదిలి వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. రకరకాల పైరవీలు చేసుకుని జిల్లాలోనే తిష్ట వేశారు. లూప్‌లైన్ పోస్టుల పేరుతో జిల్లాలోనే ఉంటున్నారు. వీరంతా ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేసి, ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టే అవకాశముందని టీడీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు.

జడ్పీని ఏలిన ప్రభాకర్‌రెడ్డి

జడ్పీ సీఈవో పోస్టు అంటే చాలా కీలకమైంది. సాధారణంగా ఈ పోస్టులో ఐఏఎస్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు పనిచేస్తారు. వైసీపీ పాలనలో మాత్రం రూల్స్ మారిపోతాయి. జడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా మూడేళ్లకుపైగా ఓ సాధారణ ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి పనిచేశారు. జిల్లాలో సీనియర్ అధికారులు చాలామంది ఉన్నా.. బడా మంత్రి అండదండలున్న ఆయన ఈ కొలువులో తిష్ట వేసుకుని ఉండిపోయారు. ప్రభాకర్‌రెడ్డి మీద ఫిర్యాదులు వెల్లువెత్తినా ఈయన్ను మార్చేందుకు సాహసించలేదు. ఎన్నికల కోడ్ వచ్చాక ఈయనను జిల్లా దాటకుండా ఉండేలా ఇంకో పోస్టులో నియమించారు. ప్రస్తుతం ఆయన మైనార్టీ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్నారు.

ఈ పోలీసు బాస్‌లు పవర్‌ఫుల్

జిల్లాలో ఎస్పీల కంటే డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ గంగిరెడ్డి మాటే ఎక్కువగా చెల్లుబాటు అవుతుందని పోలీసు వర్గాల్లో అందరికీ తెలిసిన విషయం. స్పెషల్ బ్రాంచి, చిత్తూరు, పలమనేరు డీఎస్పీగా నాలుగేళ్ల పాటు పనిచేసిన సుధాకర్‌రెడ్డి నిబంధనల మేరకు జిల్లా నుంచి బయటికి వెళ్లాలి. కోడ్ పేరుతో ఆయన్ను ఆళ్లగడ్డకు బదిలీ చేసినా, ఏసీబీ డీఎస్పీగా రెగ్యులర్ పోస్టులో నియమితులయ్యారు. స్పెషల్ బ్రాంచి ఇన్‌చార్జి డీఎస్పీగా మళ్లీ చిత్తూరుకు చేరుకున్నారు. చంద్రబాబును సొంత నియోజకవర్గంలో పర్యటించకుండా అడ్డుకోవడం, పుంగనూరు అల్లర్లను అడ్డుకోలేకపోవడం, ప్రతిపక్షాల మీద అక్రమ హత్యాయత్నం కేసులు నమోదు చేయడం, టీడీపీ నాయకుల మీద రౌడీషీట్లను తెరవడం.. వంటి ఆరోపణలను ఆయన ఎదుర్కొంటున్నారు. ఇక సీఐ గంగిరెడ్డి ఇన్‌చార్జి డీఎస్పీగా వ్యవహరిస్తూ జిల్లాను ఏలుతున్నారు. ఈయన జిల్లాలో మూడేళ్లకుపైగా పనిచేసినా లూప్‌లైన్ పేరుతో ఎస్పీలో పెట్టారే తప్ప జిల్లా మార్చలేదు.

లూప్‌లైన్ పోస్టుల్లో భద్రంగా

జిల్లాలో ఎంపీడీవోగా మూడేళ్లకుపైగా పనిచేసినా జిల్లాను వదిలి వెళ్లని మరో అధికారి శ్రీదేవి. జీడీనెల్లూరు మండలంలో ఎంపీడీవోగా పనిచేస్తూ ఆమధ్య డీఎల్‌డీవోగా ప్రమోషన్ పొందిన ఆమె ఇప్పుడు బీసీ కార్పొరేషన్ ఈడీగా కొనసాగుతున్నారు. ఆమెతో పాటు డిప్యూటీ సీఈవోగా ప్రమోషన్ పొందిన శేషారెడ్డి, జడ్పీలో రెగ్యులర్ డిప్యూటీ సీఈవోగా ఉంటూ డిప్యుటేషన్‌పై శ్రీకాళహస్తి డీఎల్‌డీవోగా కొనసాగుతున్నారు. ఈయన కూడా మూడేళ్లకుపైగా జిల్లాలో ఉన్నారు. అలాగే పలమనేరు, పిచ్చాటూరు, చిన్నగొట్టిగల్లు ఎంపీడీవోలు సాగర్, శ్రీనివాసులు, దేవేంద్రబాబు దగ్గర్లో రిటైర్ అవుతున్నారనే కారణంగా జిల్లా వదిలి పోలేదు. సుమారు ఆరుగురు తహసీల్దార్లను త్వరలో రిటైర్ అవుతున్నారనే కారణంగా మండలాల నుంచి కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. ఈ లెక్కన ఆ ఆరుగురూ జిల్లాలోనే కొనసాగుతున్నారు. జిల్లాలో వెల్ఫేర్ జేసీగా, డీఆర్వోగా పనిచేసిన రాజశేఖర్ కూడా జిల్లాలోనే కొనసాగుతున్నారు. డ్వామా పీడీగా ఈయనను లూప్‌లైన్‌లో జిల్లా దాటకుండా ఉంచుకున్నారు.

చిత్తూరు ఎస్పీగా మణికంఠ



చిత్తూరు, ఏప్రిల్ 4: చిత్తూరు ఎస్పీగా మణికంఠ చండోలును ప్రభుత్వం నియమించింది. ఇక్కడ ఎస్పీగా ఉన్న జాషువాపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో విజయవాడ సిటీ లా అండ్ ఆర్డర్ విభాగ డిప్యూటీ కమిషనరుగా విధులు నిర్వహిస్తున్న మణికంఠ చండోలును బదిలీ చేశారు. ఈయన 2018 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. గతంలో గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండెంట్‌గా, శ్రీకాకుళం జిల్లా సెబ్ ఏఎస్పీగా విధులు నిర్వహించారు. మొదటిసారిగా ఎన్నికల కమిషన్ నేరుగా జిల్లా ఎస్పీగా నియమించింది.

ముగిసిన ఇంటర్ 'స్పాట్'

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 4: చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత నెల 18న మొదలైన ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం గురువారంతో ముగిసినట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. 44 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 224 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్ మూల్యాంకనం ప్రక్రియలో పాల్గొన్నారు. మరో పది రోజుల్లో ఫలితాలు వెల్లడికానున్నాయి.

రేపు షబ్-ఎ-ఖదర్

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 4: రంజాన్ ఉపవాసాల చివరి వారం సందర్భంగా శనివారం ముస్లింలు షబ్-ఎ-ఖదర్ పండుగను జరుపుకోవాలని జిల్లా ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహారి జునైది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం రాత్రి ముస్లింలు భక్తి ప్రపత్తులతో సమాజ శ్రేయస్సు కోసం అల్లాను ప్రార్థించాలని కోరారు. ధనికులైన ముస్లింలు పేదలకు కనీసం 2.2కిలోల గోధుమలు లేదా వాటికి సరిపడా ధనం వితరణ చేయాలన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం) : సా. 6.30
సహరి (శనివారం) : ఉ. 4.46

అంతా రాజకీయం

- రెండో రోజూ పింఛన్ల కోసం పండుటాకుల అవస్థలు
- సచివాలయాల్లో బారులు



ఇది సాధ్యమే

మంచానికే పరిమితమైన అవ్వాతాతలకు, దివ్యాంగులను గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి ఉద్యోగుల ద్వారా పింఛను అందించడం సాధ్యమే. ఇలా వెదురుకుప్పం మండలం దిగువ పల్లాలు గ్రామపంచాయతీలో గురువారం సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛను నగదు పంపిణీ చేశారు. దీనిపై ప్రచారం కల్పించి జిల్లాలో ఇలాంటి వారందరికీ పింఛను అందించొచ్చు.

- వెదురుకుప్పం

నడవలేని వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి రెండు రోజుల్లో పింఛను అందిస్తామని కలెక్టరు షన్మోహన్ బుధవారం చెప్పారు. దీనిపై పెద్దగా ప్రచారం లేదు. సచివాలయాలకే రావాలంటూ వైసీపీకి చెందిన కొందరు చెబుతుండటంతో లబ్ధిదారులు అవస్థలు పడి వస్తున్నారు.

చిత్తూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పండుటాకులకు పింఛన్ల విషయంలోనూ రాజకీయం చేస్తున్నారు. పింఛన్లకు వలంటీర్లను దూరం చేస్తూ ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని తమకు అనుకూలంగా మలచుకునేందుకు వైసీపీ కుటిలయత్నం చేస్తోంది. టీడీపీ వల్లనే ఈ కష్టాలంటూ నమ్మించేందుకు పండుటాకులను ఇబ్బంది పెడుతోంది. 'పింఛను కోసం ఇప్పుడే వచ్చేయండి. శుక్రవారమే ఆఖరు. ఆ తర్వాత ఇవ్వరు. ఇప్పుడొచ్చి తీసుకోకుంటే ఈ నెల పింఛను పోయినట్లే' అంటూ పెన్షన్‌దారుల జాబితా పక్కనపెట్టుకుని కొందరు వలంటీర్లు, నేతల ద్వారా ఫోన్లు చేయిస్తున్నారు. దీంతో ఎక్కడ తమకు పింఛను రాకుండా పోతుందోనన్న ఆందోళనతో గురువారం ఉదయాన్నే అందరూ ఒక్కసారిగా సచివాలయాలకు చేరుకున్నారు. అధికారులు వచ్చి పింఛన్లు ఇచ్చే వరకు పడిగాపులు కాశారు. జిల్లాలో ఏ మండలంలో చూసినా 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఇంతటి ఎండల్లో సచివాలయాలకు వచ్చిన వృద్ధులు గంటలకొద్దీ నిలబడలేక.. నీరసించి పోయారు. ప్రతినెలా 1 నుంచి 5వ తేది వరకు పెన్షన్లను పంపిణీ చేసేవారు. ఈసారి ప్రభుత్వ ఖజానాలో నిధుల్లేక.. మూడో తేది నుంచి పంపిణీ ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసే యంత్రాంగం సచివాలయ ఉద్యోగుల రూపంలో ఉన్నా, ప్రతిపక్షాల మీద బురద జల్లేందుకు వైసీపీ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను ఇలా ఇబ్బంది పెడుతోంది. పంపిణీలో తొలిరోజైన బుధవారం డబ్బులు బ్యాంకులకు రాక, సాయంత్రం వరకూ లబ్ధిదారులు సచివాలయాల వద్దే బారులు తీరిన విషయం తెలిసిందే. తొలి రోజు 35.95శాతం పెన్షన్లను పంపిణీ చేశారు. రెండో రోజు గురువారం 52 శాతం పెన్షన్లను పంపిణీ చేయగా, మొత్తంగా 88 శాతం పంపిణీ పూర్తయింది.



పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు, తదితరులు



కానీ.. ఎందుకిలా

నడవలేని స్థితిలో ఉన్న ఈ దివ్యాంగుడిది పుంగనూరు పట్టణం. ఇతడి ఇంటికే వెళ్లి అధికారులు పింఛను ఇవ్వాలి. కానీ, శుక్రవారమే పింఛన్లకు చివరి రోజని, ఇప్పుడే వచ్చి తీసుకోవాలని, లేదంటే ఈ నెల పింఛను పోయినట్లేనంటూ కొందరు ఇతడి కుటుంబీకులను బెదరగొట్టారు. అంతే.. ముగ్గురు కుటుంబీకులు అతడిని చేతులపై ఎత్తుకొని పుంగనూరు తూర్పుపాళ్యం వార్డు సచివాలయానికి తీసుకొచ్చారు. టీడీపీవల్లే పెన్షన్ కష్టాలు వచ్చిందనే దుష్ప్రచారం చేయడానికి, ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు ఇలా దివ్యాంగుడిని ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం జగనన్నా.. అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

- పుంగనూరు

అవ్వాతాతల్లో భయం ఎందుకంటే..

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మూడు నెలల పాటు పింఛను తీసుకోకున్నా.. ఆ తర్వాతి నెలలో ఈ మొత్తాన్నీ కలిపి ఇచ్చేవారు. జగన్ సీఎం అయ్యాక ఏ నెలకా నెలలో పింఛను తీసుకోవాలి. లేదంటే ఆ తర్వాతి నెలలో ఇవ్వరు. దీంతో ఎక్కడ లేటైతే పింఛను రాకుండా పోతుందో, తమ మెడిసిన్, ఇంటిఖర్చులకు ఇబ్బంది అవుతుందోనన్న భయంతో అవ్వాతాతలు, దివ్యాంగులు సచివాలయాలకు బారులు తీరారు. లేదంటే తర్వాతి నెలలో తీసుకోవచ్చని కొందరైనా అనుకుని ఉండేవారు.

పింఛను కోసం వెళుతూ..!

- సొమ్మసిల్లి మృతి చెందిన వృద్ధుడు మురుగేష్

గుడిపాల మండలం చుక్కావారిపల్లెకు చెందిన మురుగేష్ గౌండర్(70) గురువారం పింఛను కోసం వెళుతూ సొమ్మసిల్లి.. మృతిచెందారు. తన స్వగ్రామం నుంచి రామభద్రాపురంలోని గ్రామ సచివాలయానికి వెళ్లాలంటే కిలోమీటరు దూరముంది. మధ్యాహ్నం ఆయన వంకలో నడిచి వెళ్తుండగా మార్గమధ్యంలో సొమ్మసిల్లి పడిపోయాడు. ఆయన్ను గమనించిన స్థానికులు వెంటనే గుడిపాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లగా అప్పటికే మురుగేష్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, 70 ఏళ్ల దాటిన వారికి ఇళ్ల వద్దకే పింఛను పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెప్పి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని స్థానికులు అంటున్నారు.

- గుడిపాల



మృతిచెందిన మురుగేష్



వలంటీరు హల్‌చల్

పుంగనూరు: పుంగనూరు ఎన్ఎస్‌పేట సచివాలయం వద్ద గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వలంటీరు హరి హల్‌చల్ చేశారు. అధికారులు పింఛన్లు ఇస్తుంటే.. ఇతడు పింఛన్‌దారులకు తాగునీరు ఇస్తూ.. వారికి ఏదేదో చెబుతూ కనిపించారు. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇక్కడ వలంటీరు ఎందుకు ఉన్నారని కొందరు అడిగేలోపే ఆయన వెళ్లిపోయారు.

రైతుల కడుపు కొట్టిన పెద్దిరెడ్డి

- ఆయన్ను ఇంటికి పంపే రోజు దగ్గర్లో ఉంది
- పుంగనూరులో ప్రశాంత పోలింగ్‌కు కేంద్ర బలగాలు రప్పిస్తా
- కూటమి ఎన్నికల సభలో మాజీ సీఎం నల్లారి కిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి



పుంగనూరు, ఏప్రిల్ 4: పుంగనూరు నియోజకవర్గంలో పాడి, మామిడి రైతులపై దౌర్జన్యాలు, అరాచకాలు చేసి వారి కడుపు కొట్టిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఓడించాలని మాజీ సీఎం, రాజంపేట లోకసభ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. పుంగనూరులో గురువారం జరిగిన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్ని డెయిరీల కంటే తక్కువ ధరకు పాలు కొంటున్నారని వివరించారు. ప్రస్తుతం ఎన్నికల కోసం కొంచెం ధరలు పెంచి.. మళ్లీ తగ్గిస్తారన్నారు. మామిడి రైతుకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కిలో రూ.17గా నిర్ణయిస్తే.. పెద్దిరెడ్డి కుటుంబం మాత్రం రూ.7, 8 చొప్పున ఇస్తోందన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో మూడు వేల లీటర్లు పాలు వస్తే ప్రతి చోట త్వరలోనే చంద్రబాబుతో మాట్లాడి బీఎంసీయూలు పెట్టిస్తామన్నారు. పుంగనూరులో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో కేంద్ర బలగాలు ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. పార్లమెంటులో సీఏఏ, ఎన్ఆర్‌సీ బిల్లులకు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి మద్దతుఇచ్చి.. ఇక్కడ బీజేపీ ముస్లింలకు వ్యతిరేకమని కరపత్రాలు పంచడం సిగ్గుచేటన్నారు. పెద్దిరెడ్డి అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీలను నిలువరించడానికి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న పెద్దిరెడ్డి, రాజంపేట ఎంపీగా బరిలో ఉన్న ఆయన కుమారుడు మిథున్‌ను ఓడించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ వనరులను కాజేసిన పెద్దిరెడ్డి కుటుంబం.. మరోసారి గెలిస్తే ప్రజల పట్టా భూములు కూడా లాక్కుంటారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. మైనార్టీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చంద్రబాబు చూసుకుంటారని.. ఈ విషయంలో తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. మాఫియా డాన్ పెద్దిరెడ్డి పతనం ప్రారంభమైందని, తమకు అండగా నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ఉండటంతో పెద్దిరెడ్డి ఆటలు ఇక సాగవని పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సభలో టీడీపీ నాయకులు ఎం.వెంకటరమణ రాజు, రామనాథనాయుడు, ఎం.సూర్యప్రకాశ్, ఎం.శ్రీకాంత్, సుహేల్‌బాషా, సుబ్రహ్మణ్యంరాజు, దినేశ్, మాధవరెడ్డి, కుమార్, శమిపతి, రమేశ్‌రెడ్డి, ఉయ్యాల రమణ, వెంకట మునియాదవ్, ముల్లంగి వెంకటరమణ, బీజేపీ నాయకులు సాయి లోకేశ్, ఎన్.రమేశ్, అయూబ్‌ఖాన్, మదన్ మోహన్, జనసేన నేతలు శివప్పనాయుడు, పగడాల రమణ, విరూపాక్షి, తదితరులు పాల్గొన్నారు. గురువారం రాత్రి పుంగనూరు కొత్తయిండ్లులో రాజంపేట ఎంపీ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తొలిసారిగా ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

కూటమి సభ పక్కనే వైసీపీ ప్రచార రథం హోరు

పుంగనూరులో జరిగిన కూటమి బహిరంగ సభ పక్కనే వైసీపీ ఎన్నికల ప్రచార రథం పాటలతో హోరెత్తించింది. తమ సభ జరుగుతుండగా రెచ్చగొట్టే ధోరణిలో వైసీపీ ప్రచార రథం తిరగడంతో టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మళ్లీ ప్రచార రథం అటువైపు రాకుండా చర్యలు తీసుకున్నారు. మాజీ సీఎం సభ జరుగుతుండగా రోడ్డుపై ముగ్గురు పోలీసులను పెట్టడం తప్ప, ఎస్ఐలు, సీఐలు కనిపించకపోవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు కూటమి నాయకులు తెలిపారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రతిభ



నవోదయ ప్రవేశాలు సాధించిన విశ్వం విద్యార్థులు

తిరుపతి (విద్య), ఏప్రిల్ 4: నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో తిరుపతి విశ్వం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తెలిపారు. 39 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి నవోదయ పాఠశాలల్లో ప్రవేశాలు సాధించారని వెల్లడించారు. లక్ష్మీశ్రీ, జ్యోత్స్న, ఉదయశ్రీ, లాస్య, గౌతంకుమార్, కేతన్ భాస్కర్, లిఖిత, గంగజయదీప్‌రెడ్డి తదితరులు ప్రవేశాలు పొందిన వారిలో ఉన్నారని చెప్పారు. అకడమిక డైరెక్టర్ ఎస్. విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎస్.తులసీ విశ్వనాథ్ విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాల వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థ అత్యుత్తమమైందిగా పేరుగాంచిందని చెప్పారు.

ముగిసిన పుంగనూరు గంగజాతర

● నిమజ్జనంతో ప్యాలెస్‌కు చేరిన సుగుటూరు గంగమ్మ



నిమజ్జనానికి ఊరేగింపుగా వెళుతున్న సుగుటూరు గంగమ్మ, నడివీధి గంగమ్మ

పుంగనూరు, ఏప్రిల్ 4: పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతర గురువారం ఉదయం నిమజ్జనంతో ముగిసింది. మంగళవారం జమిందారుల తొలిపూజతో ప్రారంభమైన జాతర రాత్రి ఊరేగింపు అనంతరం బుధవారం ప్యాలెస్ ఆవరణలోని ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గురువారం ఉదయం 5గంటలకు సుగుటూరు గంగమ్మను ప్యాలెస్‌లోని ఆలయం నుంచి వెలుపలకు తెచ్చి ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళుతుండగా మధ్యలో బజారువీధిలోని నడివీధి గంగమ్మ, మల్లారమ్మ కలిశారు. గంగమ్మలు సుబేదార్‌వీధి, తేరువీధి మీదుగా తూర్పుమొగసాలలోని చౌడేశ్వరిదేవి ఆలయం వరకు అట్టహాసంగా ఊరేగింపు సాగింది. చాముండేశ్వరిదేవి ఆలయానికి మల్లారమ్మ వెళ్లి సుగుటూరు గంగమ్మను పలకరించి వెనుతిరిగారు. అమ్మవారికి ఎనుపోతును బలిఇచ్చి తోటి కులస్తులు ఎనుపోతు తలను చాటలో పెట్టుకుని తీసుకెళ్లారు. గంగమ్మలకు చాముండేశ్వరి గుడి వద్ద భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని గూడూరుపల్లె పూజారులు నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమం ముగియగానే సుగుటూరు గంగమ్మ విగ్రహాన్ని ఎవరికీ కనిపించకుండా వస్త్రాలతో చుట్టి ప్యాలెస్‌కు తీసుకొచ్చి భద్రపరిచారు. ప్యాలెస్‌లో పూజారులు అమ్మవారికి అలంకరించిన ఆభరణాలను జమీందార్లుకు అప్పగించిన అనంతరం జమీందార్ల మలి పూజతో సుగుటూరుగంగమ్మ ప్యాలెస్ గృహనిర్బంధంలోకి వెళ్లడంతో జాతర ముగిసింది. సుగుటూరు గంగమ్మ సేవాసంఘసభ్యులు, మున్సిపాలిటీ, వైద్యసిబ్బంది జాతరలో సహాయక కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసులు గంగమ్మ దర్శనంలో కొందరిపై దురుసుగా ప్రవర్తించడం, వారికి కావాల్సిన వారు, అధికారపార్టీ నాయకులకు ప్రత్యేక దర్శనం కల్పించి భక్తులు, జాతరలో పనిచేసే సభ్యుల పట్ల ఇష్టం వచ్చినట్లు వ్యవహరించి విమర్శలపాలయ్యారు.



ఊరేగింపుగా వస్తున్న సుగుటూరు గంగమ్మ

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

● అనుమానాస్పదస్థితిలో మృతిగా కేసు నమోదు



మృతి చెందిన సాయి రితీష్

చౌడేపల్లె, ఏప్రిల్ 4: ఇంట్లో ఉరేసుకుని తొమ్మిదో తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. చౌడేపల్లెలోని సచివాలయం-1లో వీహెచ్‌ఏగా పని చేస్తున్న హేమకల్యాణి.. ఆమె చిన్న కుమారుడు సాయి రితీష్(14) కలిసి బజారువీధిలోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఆమె భర్త బెంగళూరులో హోటల్ నడుపుతున్నారు. 9వ తరగతి చదువుతున్న రితీష్ మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. కాగా, సచివాలయంలో విధులు ముగించుకుని మధ్యాహ్నం 2 గంటలకు హేమకల్యాణి ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు వేసి ఉండటం, కుమారుడిని పిలిచినా పలకలేదు. తలుపు గడిని బద్దలు కొట్టి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి దూలానికి ఉరేసుకుని వేలాడుతున్న కుమారుడిని చూసి షాక్‌కు గురయ్యారు. కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సహదేవుడు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

● భార్యకు తీవ్ర గాయాలు



మృతి చెందిన నాగరాజ

సోమల, ఏప్రిల్ 4: సోమల- సదుం మార్గం దిడ్డివారిపల్లె సమీపంలో ద్విచక్ర వాహనం చెట్టును ఢీకొన్న ఘటనలో నాగరాజ మృతి చెందగా.. అతడి భార్య మునీశ్వరమ్మకు తీవ్రగాయాలయ్యాయి. అన్నమయ్య జిల్లా పీలేరు మండలం రేగళ్లకు చెందిన నాగరాజ దంపతులు పలమనేరులో జరిగిన ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం పెద్దపంజాణి మండలం మాడీ గ్రామంలో ఉన్న వీరి కుమార్తె మాధవి ఇంటికి వెళ్లారు. అక్కడ్నుంచి గురువారం మధ్యాహ్నం 3గంటలకు మోపెడ్‌లో స్వగ్రామానికి బయలుదేరారు. సోమల సమీపం దిడ్డివారిపల్లె వద్ద వీరి ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. అక్కడికక్కడే నాగరాజ మృతిచెందారు. మునీశ్వరమ్మకు తీవ్రగాయాలయ్యాయి. ఈమార్గంలో ప్రయాణిస్తు తిమ్మానాయనపల్లె ఎంపీటీసీ వాసు వీరిని గుర్తించి.. క్షతగాత్రురాలిని పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి నాగరాజ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

'కూటమి' అభ్యర్థుల గెలుపే లక్ష్యం

● అట్టహాసంగా చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా సీఆర్ రాజన్ ప్రమాణం



సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 4: జిల్లాలోని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యమని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ చెప్పారు. గురువారం పార్టీ అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఉదయం దొడ్డిపల్లెలోని కన్నికలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి ర్యాలీగా కట్టమంచి, ప్రకాశం హైరోడ్డు, పీసీఆర్ సర్కిల్, కొత్త బస్టాండు, మీదుగా జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు.. పీసీఆర్ సర్కిల్ వద్ద పార్టీ అభిమానులు క్రేన్ ద్వారా సీఆర్ రాజన్‌కు గజమాల వేశారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సీఆర్ రాజన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ఇందుకు సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక ఎంపీ స్థానాన్ని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు సహకరించి, కలసికట్టుగా పనిచేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి టీడీపీ అభ్యర్థులను గెలిపించుకుని చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సురేంద్రకుమార్, గురజాల సందీప్, నేతలు వైవీ రాజేశ్వరి, సీఎం విజయ, కోదండయాదవ్, చంద్రప్రకాష్, కటారి హేమలత, కాజూరు బాలాజి, త్యాగరాజన్, సప్తగిరి ప్రసాద్, అశోక్ ఆనంద్ యాదవ్, కాజూరు రాజేష్, ఈశ్వర్, శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేడెక్కిన చిత్తూరు

● సాయంత్రం వరకు వడగాల్పులు

● సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతల నమోదు



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 4: చిత్తూరు నగరం గురువారం మండింది. మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండ కొనసాగింది. ఆ తర్వాత వడగాడ్పులు మొదలయ్యాయి. ఈ గాడ్పుల ప్రభావం సాయంత్రం 6 గంటల దాకా కొనసాగింది. దీంతో రాత్రిపూట కూడా ఆరుబయట వేడి వాతావరణం నెలకొంది. ఈ ఏడాది వేసవిలో తొలిసారిగా వరుసగా ఆరు రోజుల పాటు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ పేర్కొంది. శుక్ర, శని, ఆదివారాల్లోనూ జిల్లాలో 41డిగ్రీలకు మించి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వడగాడ్పులు వీస్తాయని హెచ్చరించారు. అత్యధికంగా నింద్రలో 42.5, శ్రీరంగరాజపురంలో 42.4, తవణంపల్లెలో 42.4, బంగారుపాళ్యంలో 41.8, పులిచెర్లలో 41.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నగరిలో 40.9, సోమలలో 40.2, పుంగనూరులో 40.1, సదుంలో 40.0, పాలసముద్రంలో 40.0, గుడిపాలలో 39.8, గుడుపల్లెలో 39.6, యాదమరిలో 39.5, చౌడేపల్లెలో 39.5, రొంపిచెర్లలో 39.5, పెద్దపంజాణిలో 39.5, కార్వేటినగరంలో 39.4, వెదురుకుప్పంలో 39.4, కుప్పంలో 38.9, చిత్తూరులో 38.6, పలమనేరులో 38.6, పెనుమూరులో 38.6, శాంతిపురంలో 38.6, గంగాధరనెల్లూరులో 38.5, గంగవరంలో 38.5, వి.కోటలో 38.5, పూతలపట్టులో 37.9, బైరెడ్డిపల్లెలో 37.8, ఐరాలలో 37.7, రామకుప్పంలో 37.1, విజయపురంలో 36.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

టెన్త్ స్పాట్‌లో సౌకర్యాల కల్పన: డీఈవో

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 4: టెన్త్ స్పాట్ కేంద్రంలో టీచర్లకు అవసరమైన ఏర్పాట్లు కల్పించినట్లు డీఈవో దేవరాజు గురువారం తెలిపారు. 1646 మంది ఉపాధ్యాయులకు అవసరమైన 450 టేబుళ్లు, 960 కుర్చీలు, 60 పెడస్ట్రియల్ ఫ్యాన్లు, 60 సీలింగ్ ఫ్యాన్లు, ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు నర్సులతో మెడికల్ క్యాంపు, క్యాంటీన్, గదుల్లో వెలుతురు ఉండేలా సీట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం



అడ్మిట్, ఆధార్ కార్డు, ఇతర ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 4: జిల్లాలో జేఈఈ మెయిన్స్ సెషన్ 2 పరీక్షలు గురువారం మొదలయ్యాయి. పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపంలోని వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు జరిగాయని సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. 172 మందికి గాను 157 మంది హాజరు కాగా, 15 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి, బయోమెట్రిక్ అనంతరం పరీక్షా కేంద్రంలోకి అనుమతించామన్నారు.

88 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 4: జిల్లాలో బుధవారం మొదలైన సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం కొనసాగించారు. సాయంత్రం 6.30 గంటల సమయానికి జిల్లాలో 88 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఇంకా 32,749 మందికి పింఛన్లు ఇవాల్సి ఉందన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

రూ.10లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల అపహరణ

పూతలపట్టు, ఏప్రిల్ 4: మండలంలోని వావిల్‌తోట పంచాయతీ లక్ష్మయ్యవూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామం పక్కనే స్వామివారి ఆలయం ఉంది. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు విలువైన వస్తువులను దొంగిలించి తీసుకెళ్ళారు. వాటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం జరుగనుంది. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం మీటింగ్ హాల్‌లో ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో ధర్మారెడ్డితో నేరుగా మాట్లాడవచ్చు. ఇందుకోసం 0877 2263261ను సంప్రదించాల్సి ఉంటుంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 61,087 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,530 మంది తలనీలాలు సమర్పించారు.

మేమంతా సిద్ధంగా లేం!

జగన్‌కి తేల్చిచెప్పిన జనం - వెలవెలబోయిన నాయుడుపేట బహిరంగసభ

ప్రచారసభల్లో పదేపదే మీరు సిద్ధమా..అంటూ జగన్ అడుగుతూ ఉంటారు. వెంటనే కెమెరాలు వేదికకు దగ్గరగా ఒకే ప్రాంతం వైపు మళ్లుతాయి.అక్కడ వ్యూహాత్మకంగా ముందే ఏర్పాటు చేసుకున్నవారు చేతులెత్తి అరుస్తారు. ఉమ్మడి జిల్లాలో మదనపల్లె, పూతలపట్టు సభల్లో ఈ డ్రామా పండినా.. తిరుపతి జిల్లా నాయుడుపేట సభలో మాత్రం అడ్డం తిరిగింది. జనం లేక సభ వెలవెలపోగా, వచ్చిన జనం కూడా జగన్ మైకు ముందుకు రాగానే జారుకోవడం మొదలుపెట్టారు. మిగిలిన ఆ కాస్తమందీ పేలవంగా స్పందించారు. ఒక రకంగా జగన్ వెంట నడవడానికి తామంతా సిద్ధంగా లేమని జనం ప్రకటించినట్టు అయ్యింది.

- నాయుడుపేట/శ్రీకాళహస్తి



జగన్ మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న జనం

జనమేరి నాయకా?

నాయుడుపేట సభకు తిరుపతి జిల్లావ్యాప్తంగా భారీగా జనాన్ని సమీకరించాలని అధికార పార్టీ నేతలు చేసిన ప్రయత్నం విఫలమైంది. గత మంగళవారం నుంచే సిద్ధం సభల కోసం 250 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. అవి మదనపల్లె, పూతలపట్టు సభలకు జనాన్ని తరలించే పనిలో బిజీగా నడిచాయి. గురువారం వాటిని నాయుడుపేట సభకు మళ్లించారు. అయితే ఆ బస్సులు సరిపోవని భావించి బుధవారం అర్ధరాత్రి అదనంగా మరో 150 బస్సులు కేటాయించారు. మొత్తం 400 బస్సులు కేటాయించినా సభకు జనం రాలేదు. సభ వేదికపైకి జగన్ చేరుకునే సమయానికి కేవలం ముందువైపు గ్యాలరీల్లో మాత్రమే కార్యకర్తలు వున్నారు. ముప్పావు వంతు గ్యాలరీలు ఖాళీగా కనిపించాయి. జగన్ వేదికపైకి రావడంతో సభ వెలుపల, రోడ్లపై వున్న కార్యకర్తలను, ప్రజలను లోనికి వెళ్ళాలంటూ పోలీసులు బతిమాలారు.జగన్ మాట్లాడడం మొదలుపెట్టిన పది నిమిషాల నుంచే ముందు వరుస గ్యాలరీల్లో పలచగా వున్న జనం కూడా బయటకు జారుకోవడం మొదలుపెట్టారు. ఇప్పటి వరకూ జరిగిన జిల్లాస్థాయి మేమంతా సిద్ధం సభల్లో ఇంతగా ఫెయిలైన సభ మరోటి లేదని పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది. రేణిగుంట మండలం గురవరాజుపల్లి వద్ద జగన్ రాత్రి బస చేసిన చోటకు 500 మంది మహిళలను బస్సుల్లో ముందే రప్పించి, ఆయన్ను చూడడానికి నిరీక్షిస్తున్నట్టు బిల్డప్ ఇచ్చారు. గంటన్నరకు పైగా అక్కడే పడిగాపులు కాసిన మహిళలకు కనీసం నిలువ నీడ కూడా లేకపోయింది. ఏర్పేడు మండలంలో ఒకటి రెండు చోట్ల మహిళా రైతులు, పెన్షనర్లు అయిన వృద్ధులను కూడా స్థానిక వైసీపీ నేత ఏర్పాటు చేశారు. అక్కడ బస్సు ఆపించి సీఎం జగన్ కిందకు దిగి వారితో మాట్లాడేలా ముందస్తు ఏర్పాటు చేశారు. కాగా జిల్లాలో మొత్తం 1100 ఆర్టీసీ బస్సులుండగా వాటిలో 400 బస్సులు సిద్ధం సభకు కేటాయించారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్లలో బస్సుల కొరత కొట్టొచ్చినట్టు కనిపించింది.

క్రేన్‌కి వేలాడినా..

ఏర్పేడులోనే ఓ కార్యకర్త క్రేన్ సాయంతో భారీ గజమాల వేసేందుకు ఏర్పాటు చేసుకున్నారు. జగన్ బస్సు సమీపించగానే క్రేన్ కొక్కీ వద్ద ఆ కార్యకర్త గాల్లో వేలాడుతూ మాల వేసేందుకు సంసిద్ధమయ్యాడు. అయితే బస్సు ఆపినా జగన్ మాత్రం కిందకు దిగలేదు. దీంతో క్రేన్ సాయంతో ఆ కార్యకర్త గజమాలను బస్సు పైభాగంలో తాకించి సంతృప్తి పడాల్సి వచ్చింది. ఇంత ప్రమాదకర ఫీట్ చేసిన ఆ కార్యకర్తను వైసీపీ నేతలు గానీ పోలీసులు గానే వారించక పోవడం విమర్శలకు దారి తీసింది. అలాగే, ముందే నిర్ణయించుకున్న చోట్ల తప్ప మరెక్కడా జగన్ బస్సు ఆగలేదు. కిందకు దిగలేదు. దీనిపై పార్టీ శ్రేణులు నిరుత్సాహానికి లోనయ్యారు.

81 కిలోమీటర్ల బస్సు యాత్రతో జనానికి నరకం

రేణిగుంట మండలం గురవరాజుపల్లి నుంచి జగన్ గురువారం ఉదయం 10 గంటలకు బయల్దేరి నాయుడుపేటకు సాయంత్రం 5 గంటలకు చేరుకున్నారు. ఈ దూరం 53 కిలోమీటర్లు. అక్కడ నుంచీ గూడూరు వద్ద జిల్లా సరిహద్దుల వరకూ 28 కిలోమీటర్లు. మొత్తం ఈ 81 కిలోమీటర్ల దూరం సాగిన బస్సు యాత్ర జిల్లావ్యాప్తంగా వేలాదిమందికి ప్రత్యక్ష నరకం చూపించింది. రేణిగుంటలో బస్సు యాత్ర ప్రారంభం కావడానికి రెండు గంటల ముందే ట్రాఫిక్ ఆపేశారు. చెన్నై, కడప, నెల్లూరు, తిరుపతి కీలక మార్గాల్లో రెండు గంటల పాటు ట్రాఫిక్ ఆపడంతో వేలాది వాహనాలు కిలోమీటర్లకొద్దీ ఆగిపోయాయి. బస్సుయాత్ర ప్రారంభమైన అరగంట తర్వాత రాకపోకలకు అనుమతించినప్పటికీ ట్రాఫిక్ జామ్ కావడంతో మరో రెండు గంటల పాటు తీవ్ర అవస్థ పడ్డారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి, పెళ్ళకూరు మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక విజయవాడ-చెన్నై జాతీయ రహదారిపై వేల కొద్దీ వాహనాలు రెండు వైపులా నిలిచిపోయాయి. ఇలా కనీసం నాలుగైదు గంటల పాటు జాతీయ రహదారిపై వాహనాలు చిక్కుకుపోయాయి. రేణిగుంట మండలం రామకృష్ణాపురం కూడలి వద్ద రెండు అంబులెన్సులు ఇరుక్కుపోయాయి. ఓ వాహనం రోగిని తేవడానికి శ్రీకాళహస్తికి వెళుతుండగా మరోటి రోగిని తిరుపతికి తీసుకెళుతూ గంటలకొద్దీ చిక్కుకుపోయింది. వేసవిలో ఎండ ధాటికి తోడు ఉక్కపోతకు వాహనాల్లోని జనం నరకయాతన అనుభవించారు.



ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్

డ్రైవర్లు తక్కువ...యజమానులే ఎక్కువ

తొట్టంబేడు మండలం పొయ్య గ్రామం వద్ద సీఎం జగన్ లారీ, ఆటో డ్రైవర్లతో ముఖాముఖీ సమావేశమయ్యారు. నిజానికి హాజరైన వారిలో లారీ, ఆటో డ్రైవర్లు చాలా తక్కువ. వాటి యజమానులే ఎక్కువగా కనిపించారు. సమావేశంలోకి జగన్ రాకముందే ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ పాత్రికేయులను స్థానిక నేతల ద్వారా గుర్తించి బయటకు పంపించేశారు. సమావేశం పేరుకు ముఖాముఖీ అయినా వారితో ముఖాముఖీ మాట్లాడిందేమీ లేదు. వారి చేతికి మైక్ ఇవ్వడంతో ఎక్కువమంది జగన్‌ను పొగిడేందుకే సమయం వెచ్చించారు. ఒకరిద్దరు సమస్యలు ప్రస్తావించినా జగన్ వాటిని వినిపించుకోనట్టుగా మిన్నకుండిపోయారు. ఎవరైనా సలహాలు, సూచనలు చేయదలిస్తే స్లిప్పులో రాసి పెట్టెల్లో వేస్తే తాను తర్వాత పరిశీలిస్తానంటూ వెళ్లిపోయారు.

సీఎం చెక్కు చెల్లాలంటే 40 రోజులు ఆగాలట!

రేణిగుంట మండలం గురవరాజుపల్లి నుంచీ బస్సు యాత్ర ప్రారంభించిన సీఎం జగన్ కొంచెం దూరం వెళ్లగానే వెదుళ్ళ చెరువు వద్ద తండ్రీ కొడుకులు ఆపారు. తన 12 ఏళ్ళ కుమార్తె చైత్ర వినికిడి సమస్యతో బాధపడుతుంటే ఆపరేషన్ చేయించామని తండ్రి వివరించాడు. సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేయగా చెక్కు వచ్చిందని, కానీ చెల్లడం లేదని వాపోయాడు. అయితే సీఎం సహాయనిధి నుంచీ సాయం అందాలంటే 40 రోజులు ఆగాలి అని సమాధానం ఇచ్చి జగన్ ముందుకు సాగిపోవడంతో తండ్రీ తనయులు తెల్లబోయారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

పలమనేరు, ఏప్రిల్ 4: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఎంఈఓ లీలారాణి ఆకాంక్షించారు. గురువారం పలమనేరు బాలికోన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్‌క్రాప్స్ నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ వర్క్‌షాపులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న వాతావరణ కాలుష్యానికి అడ్డుకట్ట వేయకపోతే మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఏపీ ఎన్‌జీసీ జిల్లా కో ఆర్డినేటర్ ఏబీ చైతన్య మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడాలన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశంపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్లు దేవేంద్ర, హెడ్‌మాస్టర్ లత, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ ప్రతాప్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేఈసీలో ఘనంగా అంతరిక్ష -2కే24


సింపోజియం ప్రారంభిస్తున్న ప్రముఖులు

కుప్పం, ఏప్రిల్ 4: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అంతరిక్ష - 2కే24 టెక్నికల్ సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు నవీన, సాంకేతిక అంశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఎదగాలన్నారు. కలికిరి జేఎన్టీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ నజీరా మాట్లాడుతూ అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ విభాగాల పరిశోధనలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. క్రిష్ణగిరి పీఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎం.శ్రీనివాసన్ జ్యూరీగా వ్యవహరించారు. వివిధ అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కేఈసీ ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి కె.లోకేశ్ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో పేదరిక నిర్మూలన


శంఖారావంలో టీడీపీ నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 4: సూపర్‌సిక్స్ పథకాలతో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మన్ సీతాపతి చెప్పారు. గురువారం రామకుప్పంలోని కోదండరామనగర్‌లో వారు శంఖారావం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్నివర్గాలకు ఇబ్బందులు తప్ప మేలు జరగలేదన్నారు. ప్రభుత్వ ఆసరా కరవై పేదలు, మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లారన్నారు. జగన్ అన్ని హామీలను తుంగలో తొక్కారన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందలేదన్నారు. టీడీపీ కూటమి సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు భరోసా ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో నేతలు రామకృష్ణప్ప, సలాంసాబ్, పద్మనాభరెడ్డి, టీవీరవి, బాలరాజు, సుబ్రీ, సతీష్, మంజునాథ్, అవినాశ్‌రెడ్డి, ఆదిల్, నరసింహులు, శంకర్, మిఠాయిమంజు, రాజ, బోరుగులశీన, నిసార్, చంద్‌బాషా, మునికృష్ణబాబు, మురళీ, పద్మమ్మ, అలవేలుమంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు రామకుప్పంలో జయహో బీసీ సమావేశం

రామకుప్పం, ఏప్రిల్ 4: టీడీపీ ఆధ్వర్యంలో రామకుప్పంలో శుక్రవారం జయహో బీసీ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ బీసీ విభాగ నేతలు చలపతి, చిన్నికృష్ణ, పత్ర నారాయణాచారి, వేలు, విశ్వనాథ్, వెంకటరమణ, సుబ్రీలు కోరారు. గురువారం వారు రామకుప్పంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోకవర్గ పరిశీలకుడు గాజులఖాదర్‌బాషా, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామిలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.

కుప్పం కాంగ్రెస్ కార్యాలయం ధ్వంసం


ఫర్నిచర్ ధ్వంసం చేస్తున్న కార్యకర్తలు

కుప్పం, ఏప్రిల్ 4: కుప్పం కాంగ్రెస్ కార్యాలయాన్ని గురువారం కార్యకర్తలు ధ్వంసం చేశారు. కష్టపడినవారికి కాకుండా నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చిన ఆవుల గోపికి టికెట్టు ఇవ్వడాన్ని నిరసిస్తూ విధ్వంసానికి దిగారు. అధిష్ఠానం నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోవడంతో ఒక వర్గానికి చెందిన కార్యకర్తలు గురువారం ప్యాలెస్ రోడ్డులోని పార్టీ కార్యాలయానికి చేరుకుని తాళాలు పగులగొట్టి కుర్చీలు, టేబుళ్ల వంటి ఫర్నిచర్ కిందికి తీసుకొచ్చి ధ్వంసం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయానికి తాళం వేసి వెళ్లిపోయారు.

నిరుపేద ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ


పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్4: నిరుపేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా వాహిద్ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక కొత్తయిండు ఫలాహ్ స్కూల్ ఆవరణలో 150 ముస్లిం కుటుంబాలకు కొత్త దుస్తులు, సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు అబ్దుల్, అలీమ్‌లు మాట్లాడుతూ ఏటా రంజాన్ సందర్భంగా సరుకులు ఆనవాయితీగా ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మహమ్మద్, ఇబ్రహీం, సలీం, కాజా, షఫీఉల్లాఖాన్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ల రాజీనామా

కుప్పం రూరల్, 4: కుప్పం మండలం ఉర్లవోబనపల్లె పంచాయతీకి చెందిన 15 మంది గ్రామ వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు సమర్పించారు.

సదుం: మండల పరిధిలోని వలంటీర్లు గురువారం తమ రాజీనామాలను ఎంపీడీవో రాజశేఖర్ బాబుకు అందజేశారు. మండలంలో 187 మంది వలంటీర్లు పనిచేస్తుండగా ఇటీవల ముగ్గురిని తొలగించారు. మిగిలిన వారందరూ రాజీనామా సమర్పించినట్లు ఎంపీడీవో తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం

రొంపిచెర్ల, ఏప్రిల్ 4: తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిలో రొంపిచెర్ల మండలం బండకిందపల్లె పంచాయతీ మట్లోళ్లపల్లె వద్ద గుర్తు తెలియని వ్యక్తి శవం గురువారం ఉదయం గుర్తించినట్లు ఎస్‌ఐ సుకుమార్ తెలిపారు. వీఆర్వో మబారక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. 45 సంవత్సరాల పురుషుని మృతదేహంపై బ్లూ షర్టు, చిన్న చిన్న గడులు కలిగిన బ్లూ లుంగీ ఉంది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏనుగుల సంచారంతో రైతుల బెంబేలు


బోనమంద సమీపంలో ధ్వంసమైన మామిడి చెట్లు

సోమల, ఏప్రిల్ 4: సోమల మండలంలో ఏనుగుల సంచారంతో రైతన్నలకు కునుకు లేకుండా పోతోంది. బుధవారం రాత్రి పేటూరు పంచాయతీ బోనమంద సమీపంలోని పొలాల్లో జంట ఏనుగులు సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు రోజులుగా పలువురి రైతుల మామిడి తోటల్లో చెట్లను విరిచి నష్టం కల్గించాయి. డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. కనికల చెరువు వద్ద మకాం వేసిన ఏనుగుల జంట ఎవరి పొలంలోకి వస్తుందోనని రైతులు కునుకు లేకుండా జాగరణ చేస్తున్నారు. ప్రస్తుతం మామిడితోటల్లో పిందె దశలో కాయలు ఉండడం, టమోటాలు కోత దశలో ఉండడంతో వీరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మామిడితోటకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు రూరల్, ఏప్రిల్4: మండలంలోని నెక్కుంది పంచాయతీ బత్తలాపురానికి చెందిన నరేశ్ మామిడితోటకు గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దాదాపు రూ. 30వేలు విలువ చేసే మామిడి చెట్లు కాలిపోయినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. మంటలను అదుపు చేశామన్నారు. చుట్టు పక్కల దాదాపు 15 ఎకరాలలో మామిడి, అల్లనేరేడు చెట్లు ఉన్నట్లు తెలిపారు. సమయానికి వెళ్లి మంటలను అదుపు చేయడంతో నష్టం విలువ తగ్గిందన్నారు.


కిక్కిరిసిన ఉబేదుల్లా కాంపౌండ్ సచివాలయం


భగత్‌సింగ్‌కాలనీలో వృద్ధుల నిరీక్షణ


నడిమూరులో మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్న టీడీపీ శ్రేణులతో ఘర్షణకు దిగిన వైసీపీ కార్యకర్తలు

వైసీపీ విష ప్రచారంతో పింఛనుదారుల అవస్థలు

● రెండో రోజూ పింఛన్లలో తాత్సారం

కుప్పం, ఏప్రిల్ 4: పింఛన్ల పంపిణీలో జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న పైశాచిక పోకడ ఫలితంగా గురువారం కూడా వృద్ధులకు ఇబ్బందులు తప్పలేదు. తెలుగుదేశంపై దుష్ప్రచారం ద్వారాఎన్నికల్లో లబ్ధి పొందాలనే స్వార్థ రాజకీయం పింఛనుదారులకు నరకం చూపిస్తోంది. కుప్పం మున్సిపాలిటీతోపాటు మండలంలోని దాదాపు అన్ని సచివాలయాల వద్ద గురువారం ఉదయం 8 గంటలకల్లా వృద్ధులు చేరుకున్నా సిబ్బంది ఆలస్యంగా పంపిణీ ప్రారంభించారు. దీంతో పింఛనుదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. మధ్యాహ్నం అవుతున్నా చాలా మందికి అందలేదు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలున్న వారలో కొందరు సొమ్మసిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితిని గమనించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు మున్సిపాలిటీ, మంకలదొడ్డి, నడిమూరు వంటి గ్రామీణ సచివాలయాలవద్ద టీడీపీ నాయకులు మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లతో పాటు బిస్కట్ ప్యాకెట్లు కూడా పంపిణీ చేశారు.


బజారువీధి సచివాలయంలో పింఛన్ల రిజిస్టర్‌పై వైఎస్సార్ పింఛన్ రిజిస్టర్ పేరు


మంకలదొడ్డి పంచాయతీ కార్యాలయం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

● అడ్డుకున్న వైసీపీ: నడిమూరు వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలను వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ కొద్దిసేపు ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. వృద్ధులు ఎదురు తిరగడంతో వైసీపీ కార్యకర్తలు కూడా మజ్జిగ పంపిణీ చేశారు.

వైసీపీ దుష్ప్రచారాన్ని ఎవరూ విశ్వసించరు: టీడీపీ


మాట్లాడుతున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఏప్రిల్ 4: పెన్షన్ పంపిణీకి సంబంధించి తెలుగుదేశం పార్టీపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం మండిపడ్డారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు కోరినా తగినంత మంది సిబ్బంది ఉన్నా వైసీపీ ప్రభుత్వం కావాలనే కుట్ర పన్నిందన్నారు. చంద్రబాబు చెబితేనే పెన్షన్లు ఆపేశారంటూ వారు చేస్తున్న దుష్ప్రచారం ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. వలంటీర్లను జగన్ రాజకీయ ప్రయోజనాల కోసమే వాడుకుంటున్నారని ఆక్షేపించారు. కొంతమంది వలంటీర్లను బెదిరించి రాజకీయంగా వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే వలంటీర్లకు మెరుగైన అవకాశాలు కల్పిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సత్యేంద్రశేఖర్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క వీరంగం

- వృద్ధురాలు సహా ఆవు, మేకను కరిచిన కుక్క


వృద్ధురాలి చేతికి గాయమైన దృశ్యం

వెదురుకుప్పం, ఏప్రిల్ 4: పిచ్చి కుక్క వీరంగంతో వృద్ధురాలు సహా ఆవు, మేకకు గాయాలయ్యాయి. ఈ ఘటన వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామ పంచాయతీ మర్రిమాకులకండ్రిగ గ్రామంలో జరిగిందని ఆ గ్రామస్తులు గురువారం తెలియజేశారు. పిచ్చి కుక్క ఆ గ్రామానికి చెందిన మహాలక్ష్మి(64) అనే వృద్ధురాలి చేతిని కరిచింది. అలాగే ఆ గ్రామంలో ఆవు, మేకను కరిచిందని తెలిపారు. గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

పింఛనుదారులతో సర్కార్ ఆటలు : అమర్


వి.కోటలో ముస్లింలతో కలసి ప్రార్థనల్లో అమరనాథరెడ్డి

వి.కోట, ఏప్రిల్ 4: వలంటరీ వ్యవస్థకు తమ పార్టీ వ్యతిరేకం కాదని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. సేవా దృక్పదంతో పని చేసేందుకు తీసుకువచ్చిన వ్యవస్థను అధికార పక్షం రాజకీయాలకు వాడుకుంటోందని తప్పుపడుతున్నామన్నారు. గురువారం వి.కోటలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలు చేసే వలంటీర్లను ఉపేక్షించమన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఈసీ సూచన మేరకు పక్కన వారిని పెట్టారన్నారు. దానిని ప్రభుత్వం అనుకూలంగా మలచుకునే యత్నాలు చేయడం దురదృష్టకరమన్నారు. సచివాలయాల సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దే రెండు రోజుల్లో పింఛన్లు ఇవ్వవచ్చన్నారు. ఆదిశగా చర్యలు చేపట్టకుండా జగన్‌రెడ్డి వృద్ధులు, వికలాంగుల పింఛన్లతో కొత్త ఆటలాడుతున్నారన్నారు. ప్రతిపక్షాలను దూషించేందుకే అధికార పక్షం పింఛన్ల నాటకానికి తెరలేపిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.4 వేలు పింఛను అందిస్తామని హామీ ఇచ్చారు. వివేకా, హత్య, కోడికత్తి డ్రామాల తరహాలో పింఛను అంశాన్ని సానుభూతిగా మలచుకునేందుకు జగన్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారన్నారు. ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, జిల్లా మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షులు ఎస్.ఏ.ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

వి.కోటలో ఇఫ్తార్ విందులో అమరనాథరెడ్డి

వి.కోట జిమాయా మసీదులో ముస్లింలతో కలసి మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక టీడీపీ నేతలతో కలసి వచ్చిన ఆయనకు ముస్లిం ఘనంగా స్వాగతం పలికారు. వారితో కలసి మసీదులో ప్రార్థనలో పాల్గొన్నారు. రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ సుఖ, సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

పెద్దపంజాణి, ఏప్రిల్ 4: బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక ఎదుగుదల తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని బీసీ నాయకుడు గంగప్ప పేర్కొన్నారు. గురువారం పెద్దపంజాణి మండలం రాయలపేట, ముత్తుకూరు గ్రామాలలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 అంశాలతో కూడిన బీసీ డిక్లరేషన్ గురించి వివరించారు. టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. బీసీ నాయకులు నాగభూషణం, మాజీ ఎంపిపి మురళీ కృష్ణ, చలపతి, నాగరాజ, రామకృష్ణ, సుధాకరరెడ్డి, రుద్రమూర్తి నాయుడు, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

నల్లారికి టీడీపీ నాయకుల స్వాగతం


చౌడేపల్లెలో కిరణ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న స్థానిక టీడీపీ నాయకులు

చౌడేపల్లె, ఏప్రిల్4: మాజీ సీఎం, రాజంపేట పార్లమెంట్ ఉమ్మడి కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి చౌడేపల్లె మండలంలో స్థానిక టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. గురువారం పుంగనూరులో జరిగే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి వెళుతున్న ఆయనకు, ఆయన సోదరుడు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలకు స్థానిక బస్టాండులో స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్థసారథి, కుమార్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమల: మోదీ మూడోసారి ప్రధాని కావడం తథ్యమని మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన కలికిరి నుంచి పుంగనూరు కార్యకర్తల సమావేశానికి వెళుతున్న ఆయనకు ఇరికిపెంట వద్ద టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. టీడీపీ మహిళా నాయకులు హారతులు పట్టి సన్మానించారు. పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు నాయుడు, మమత, కపిల సుబ్రమణ్యం, మనోహర్, పీఎం చంద్రశేఖర్, పార్థసారథి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్లు, పింఛన్లపై సీఎం జగన్ దుష్ప్రచారం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 4: వలంటీర్ల వ్యవస్థ, పింఛన్ల పంపిణీపై సీఎం జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ విమర్శించారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం పూతలపట్టులో జరిగిన సభలో సీఎం జగన్ టీడీపీపై నిందలు వేయడం సరికాదన్నారు. జగన్‌కు పాలన చేతకాక టీడీపీపై బురదజల్లే విధంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఈసీ ఆదేశాలను తప్పుదోవపట్టేలా మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. పింఛన్ల పంపిణీని వలంటీర్ల ద్వారా కాకుండా ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని ఈసీ ఆదేశించిందేకాని పింఛన్లు ఇవ్వకూడదని చెప్పలేదన్నారు. ఈ విషయం సామాన్య ప్రజలకు కూడా తెలుసని అన్నారు. జగన్‌రెడ్డి ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ వలంటీర్లకు టీడీపీ తగిన గౌరవం ఇస్తుందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతి సభలోనూ స్పష్టం చేస్తున్నారని పేర్కొన్నారు. ఖజానాలోని డబ్బులు దోచుకుని ఎన్నికలకు వాడుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ కోడికత్తి డ్రామా, వివేకానంద రెడ్డి గొడ్డలి వేటు డ్రామాలు అయిపోయాయని, ఇప్పుడు పింఛన్లు, వలంటీర్లను అడ్డుపెట్టుకుని కొత్త డ్రామాకు తెరలేపారని అన్నారు. పింఛన్ల పంపిణీ సక్రమంగా లేకపోవడంతో అనేకమంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మరణిస్తున్నారని చెప్పారు. ఈ మరణాలకు కారణమైన సీఎం జగన్‌పై హత్య కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, నేతలు కోదండయాదవ్, కాజూరు బాలాజి, సప్తగిరి ప్రసాద్, సప్తగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత తత్వ రాజకీయాలు జగన్ నైజం: ఖాదర్ బాషా


సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

రామకుప్పం, ఏప్రిల్ 4: మతతత్వ రాజకీయాలు జగన్ నైజమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా విమర్శించారు. గురువారం ఆయన రామకుప్పం టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు అండగా నిలిచేది టీడీపీయేనన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు బీజేపీతో అంటకాగిన వైసీపీకి ఇప్పుడు టీడీపీ ఎన్డీయేలో చేరితే అభ్యంతరం వచ్చిందా అని ప్రశ్నించారు. టీడీపీ ఎన్డీయేలో ఉన్నా ముస్లింలకు కష్టం రాకుండా చంద్రబాబు చూసుకున్నారన్నారు. టీడీపీ ఎన్డీయేలో ఉన్నప్పుడే ముస్లిం మైనారిటీ సబ్‌ప్లాన్ ద్వారా మసీదులు, కబరస్తాన్లు, షాదీఖానాల నిర్మాణం, మరమ్మతులు చేపట్టారన్నారు. ముస్లింలపై కపటప్రేమ ప్రదర్శిస్తూ అధికారంలోకి వచ్చాక వైసీపీ ప్రభుత్వం హామీలకు చరమగీతం పాడిందన్నారు. ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, మునస్వామి, పత్ర నారాయణచారి, విశ్వనాథ్, ముస్లిం నేతలు సలాంసాబ్, మహ్మద్‌రఫీ. ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై ఈసీ సుమోటోగా కేసు నమోదుచేయాలి

● పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 4: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తున్న సీఎం జగన్‌పై ఈసీ సుమోటోగా కేసు నమోదు చేయాలని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మురళీ మోహన్ డిమాండ్ చేశారు. గురువారం చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘాన్ని, అధికారులను నిర్వీర్యం చేసేవిధంగా ఆరోపణలు చేసిన సీఎం జగన్‌పై ఈసీ కేసు నమోదు చేయాలని కోరారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి సభలవల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. బుధవారం జరిగిన సీఎం సభలో పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధికి ఏమైనా హామీలు ఇస్తారేమోనని ప్రజలు ఎదురుచూశారని, కానీ నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

55 రోజులుగా పేదలకు అన్నదానం

ఐరాల, ఏప్రిల్ 4: మండల కేంద్రమైన ఐరాలలో గత 55 రోజులుగా అన్న క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని వేదగిరివారిపల్లె పంచాయతీ దిగువనాగులవారిపల్లెకు చెందిన టీడీపీ నేత మోతుకూరి సోమశేఖర్ నాయుడు జైశ్రేష్ఠ ఫౌండేషన్ తరపున లక్షలాది రూపాయల ఖర్చుతో అన్నక్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేస్తున్నారు.

14 వరకు ఓటు నమోదు అవకాశం: ఆర్డీవో

నగరి, ఏప్రిల్ 4: రాబోయే సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 14వ తేది సాయంత్రం 5గంటల వరకు ఓటు నమోదుకు అవకాశం కల్పించినట్లు నగరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడానికి సిబ్బంది సిద్ధంగా వున్నారని తెలిపారు. ప్రచారపర్వంలో నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అన్ని రాజకీయపార్టీల నాయకులు, తహశీల్దారులు, పరిశీలకులు పాల్గొన్నారు.

కమనీయంగా ద్రౌపది కల్యాణం



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 4: నగరపాలక పరిధిలోని 21వ డివిజన్ కుక్కపల్లె లక్ష్మయ కండ్రిగలోని ద్రౌపది సమేత ధర్మరాజుల గుడిలో గత 8 రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం ద్రౌపది కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు.కార్యక్రమంలో అర్జునుడు మత్స్య యంత్రం పడగొట్టడం తదితర ఘట్టాలతో పాటు చివరగా ద్రౌపదీ పాండవుల కల్యాణాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోపాల్ అయ్యంగార్, ధర్మకర్తలు పూల సుబ్రమణ్యం నాయుడు, యం. కుమారస్వామి నాయుడు, సిద్ధయ్య నాయుడు, హరిబాబు నాయుడు, రవి నాయుడు, రామచంద్రయ్య, గోవిందయ్య పాల్గొన్నారు..

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జేసీ

గుడిపాల, ఏప్రిల్ 4: మండలంలోని వసంతాపురం, గొల్లమడుగు పోలింగ్ కేంద్రాలను గురువారం జేసీ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని గొల్లమడుగు చెక్‌పోస్టు వద్ద తనిఖీలను ముమ్మరం చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి, ఆర్ఐ రామసాయి, ఉద్యోగులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల వైఫల్యాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ

● ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రవిరాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రవిరాజు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 4: మాతా శిశు మరణాల వైఫల్యాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రవిరాజు తెలిపారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతా శిశు మరణాల నియంత్రణపై గైనకాలజిస్టులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహ వయస్సుపై తప్పకుండా స్కూల్ స్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే టీనేజ్ ప్రెగ్నెన్సీపై, హైరిస్క్ గర్భిణులను త్వరితిగతిన గుర్తించి అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు అందించాలన్నారు. హైరిస్క్ కేసుల కాన్పులకు తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను వినియోగించుకోవాలన్నారు. ఆస్పత్రిలోనే కాన్పు అయ్యేటట్లు ప్రోత్సహించాలని, ప్రతి గర్భిణీకి టిఫా స్కాన్ ద్వారా అవసరమైన చికిత్స అందించాలన్నారు. నెలల నిండకుండా కాన్పు అయ్యే బిడ్డలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పుట్టినప్పటి నుంచి వేయాల్సిన వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆదేశించారు. గైనకాలజిస్టులు ఉషశ్రీ, మీనా సయ్యద్, చిన్నపిల్లల వైద్యులు మమత, లత, ఎంసీహెచ్ కోఆర్డినేటర్ జానకిరావు, ఎస్‌వో జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

55 రోజులుగా పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సోమశేఖర్‌నాయుడు తదితరులు

ఐరాల, ఏప్రిల్ 4: మండల కేంద్రమైన ఐరాలలో గత 55 రోజులుగా అన్న క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని వేదగిరివారిపల్లె పంచాయతీ దిగువనాగులవారిపల్లెకు చెందిన టీడీపీ నేత మోతుకూరి సోమశేఖర్ నాయుడు జైశ్రేష్ట ఫౌండేషన్ తరఫున లక్షలాది రూపాయల ఖర్చుతో అన్నక్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేస్తున్నారు. ప్రతి రోజు ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారు, బస్సుల కోసం వేచి ఉండే వారు, గ్రామంలోని పేదలు భోజనాన్ని తీసుకుంటున్నారు. దాత సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడంలో తనకు చాలా ఆనందంగా ఉందన్నారు.

ఒట్టేసి చెబుతున్నాం.. ఓటు వేస్తామని..



మాపాక్షిలో మహిళలకు ఓటుపై అవగాహన కల్పిస్తున్న స్వీప్ సిబ్బంది

చిత్తూరు, ఏప్రిల్ 4: ఒట్టేసి చెబుతున్నాం.. తప్పకుండా ఓటు వేస్తామంటూ మహిళలు ఓటు నినాదాన్ని బలంగా చాటారు. నగరపాలక సంస్థ పరిధిలోని మాపాక్షి, అనుప్పల్లె వార్డు సచివాలయాల పరిధిలో మహిళలకు స్వీప్ సిబ్బంది ఓటు విలువ గురించి అవగాహన కల్పించారు. గత ఏడాది తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాపాక్షి, అనుప్పల్లె వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో మహిళలంతా ఓటు వేయడంతో పాటు ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, టీము సభ్యులు పాల్గొన్నారు.

రాజీనామా డ్రామా ఆడుతున్న వలంటీర్లు: టీడీపీ



ఏవోకు రాజీనామా పత్రాన్ని అందచేస్తున్న వలంటీర్లు, వైసీపీ నాయకులు

విజయపురం, ఏప్రిల్ 4:మండలంలోని పాతార్కాడులో వైసీపీకి అనుకూలంగా ఉండే వలంటీర్లు రాజీనామా పేరుతో డ్రామా ఆడుతున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, పాతార్కాడు సర్పంచ్ బొబ్బిలి ఆరోపించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ పాతార్కాడులో వలంటీర్లు రాజేశ్వరి, సురేష్, ప్రభుత్వ మద్యం షాపు ఉద్యోగి దేవరాజులు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని ఏప్రిల్ 2వ తేదీన నియోజకవర్గ ఆర్వోకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయినప్పటికీ వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. వలంటీర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాగా పాతార్కాడుకు చెందిన ముగ్గురు వలంటీర్లు సురేష్, మోహన్‌బాబు, రాజేశ్వరి రాజీనామా చేస్తున్నట్టు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏవో రమణప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని ఈసీ ఆంక్షలు విధించడం వలన తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వైసీపీ నాయకులు సతీష్‌యాదవ్, నారపరాజు తదితరులు పాల్గొన్నారు.

పదిరోజులుగా తాగునీటి సమస్య



నీటి సమస్యపై ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 4: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మకాలనీలో గత 10 రోజులుగా తాగునీటి సమస్య ఉన్నా ఎవ్వరూ పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సమస్య గురించి సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, ట్యాంకర్ ద్వారానైనా నీటిని సరఫరా చేయాలని కోరారు. కాలనీలో మురుగునీరు పోయేందుకు కాలువలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను కోరారు. ఎంపీడీవో స్పందించి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని మహిళలకు హామీయిచ్చారు.

జగన్‌పై ఈసీ సుమోటోగా కేసు నమోదుచేయాలి

● పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 4: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తున్న సీఎం జగన్‌పై ఈసీ సుమోటోగా కేసు నమోదు చేయాలని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ డిమాండ్ చేశారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘాన్ని, అధికారులను నిర్వీర్యం చేసేవిధంగా ఆరోపణలు చేసిన సీఎం జగన్‌పై ఈసీ కేసు నమోదు చేయాలని కోరారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి సభలవల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. బుధవారం జరిగిన సీఎం సభలో పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధికి ఏమైనా హామీలు ఇస్తారేమోనని ప్రజలు ఎదురుచూశారని, కానీ నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. సీఎం జగన్ పింఛన్ పంపిణీని రాజకీయ ప్రయోజనాలకోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

14 వరకు ఓటు నమోదు అవకాశం: ఆర్డీవో



అఖిలపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న నగరి ఆర్డీవో

నగరి, ఏప్రిల్ 4: రాబోయే సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 14వ తేది సాయంత్రం 5గంటల వరకు ఓటు నమోదుకు అవకాశం కల్పించినట్లు నగరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడానికి సిబ్బంది సిద్ధంగా వున్నారని తెలిపారు. ప్రచారపర్వంలో నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో అన్ని రాజకీయపార్టీల నాయకులు, నగరి, నిండ్ర, విజయపురం పుత్తూరు, వడమాలపేట తహశీల్దారులు, ఎన్నికల ఖర్చులను పరిశీలించే పరిశీలకులు పాల్గొన్నారు.

కుప్పం కాంగ్రెస్ కార్యాలయం ధ్వంసం

కుప్పం, ఏప్రిల్ 4: కుప్పం కాంగ్రెస్ కార్యాలయాన్ని గురువారం కార్యకర్తలు ధ్వంసం చేశారు. కష్టపడినవారికి కాకుండా నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చిన ఆవుల గోపికి టికెట్టు ఇవ్వడాన్ని నిరసిస్తూ విధ్వంసానికి దిగారు. అధిష్ఠానం నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోవడంతో ఒక వర్గానికి చెందిన కార్యకర్తలు గురువారం ప్యాలెస్ రోడ్డులోని పార్టీ కార్యాలయానికి చేరుకుని తాళాలు పగులగొట్టి కుర్చీలు, టేబుళ్ల వంటి ఫర్నిచర్ కిందికి తీసుకొచ్చి ధ్వంసం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయానికి తాళం వేసి వెళ్లిపోయారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 4: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో గురువారం నలగాంపల్లెకు చెందిన బాలరాజు నాయుడు సతీమణి ఎన్‌పీ శ్యామల జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ గౌడ్, సుదర్శన్ నాయుడు, సూరి నాయుడు, రవి, శ్రీనివాసులు ఉన్నారు.

అటవీశాఖలో తుప్పు పడుతున్న వాహనాలు



కార్వేటినగరం, ఏప్రిల్ 4: కార్వేటినగరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో వివిధ కేటగిరీల్లో పట్టుబడిన వాహనాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తప్పు పట్టి పోతున్నాయి. ఎర్రచందనం, కలప అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలను అటవీశాఖ ఆధ్వర్యంలో ఉంచుతున్నారు. పట్టుబడిన వాహనాల కేసులు ఎప్పుడు పరిష్కారమవుతాయో తెలియదు. అయితే ఆరుబయట ప్రదేశంలో పార్కింగ్ చేసి ఉంచడం వలన వాహనాలు శిథిలస్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. అటవీశాఖ పరిధిలో పట్టుకున్న వాహనాలకు రక్షణ కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఓటు హక్కుపై అవగాహన

నిండ్ర, ఏప్రిల్ 4: ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని ఇందిరాక్రాంతి ఏపీఎం చంద్రకళ అన్నారు. గురువారం మండలంలోని అత్తూరు, ఇరుగువాయి పంచాయతీల్లో గ్రామ సమాఖ్య మహిళలకు ఓటుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నా సూచించారు. క్లస్టర్ కో-ఆర్డినేటర్లు గిరి, నాగేశ్వరరావు, ప్రభాకర్, పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

● గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 4: నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తానని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం స్థానిక 31, 32వ డివిజన్లలోని ఆర్టీసీ డిపోరోడ్డు, రాంనగర్ కాలనీలోని పలు వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ ఉమ్మడి మ్యానిఫెస్టో, బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. గురజాల మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతులే కాని వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. కనీసం గుంతల రోడ్లకు మరమ్మతులు కూడా చేయలేదని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌కు స్థానికులు హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ మేయర్ కటారి హేమలత, జనసేన నేతలు ఆరణి కవిత, ఏకే శరవణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గురజాల జగన్మోహన్ తదితరులు

టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

● గురజాల ప్రతిమ



నంగమంగళంలో గురజాల ప్రతిమ ఎన్నికల ప్రచారం

గుడిపాల, ఏప్రిల్ 4: టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని గురజాల ప్రతిమ అన్నారు. గురువారం మండలంలోని నంగమంగళం, బొమ్మసముద్రం గ్రామాల్లో ఇంటింటికీ టీడీపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడును, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావులను గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు దీపశ్రీ, సుమతి, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఉదయ, శిల్ప, చంద్రన్, విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా ద్రౌపది కల్యాణం



హోమం నిర్వహిస్తున్న ధర్మకర్తలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 4: నగరపాలక పరిధిలోని 21వ డివిజన్ కుక్కపల్లె లక్ష్మయకండ్రిగలోని ద్రౌపది సమేత ధర్మరాజుల గుడిలో గత 8 రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం ద్రౌపది కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు.కార్యక్రమంలో అర్జునుడు మత్స్య యంత్రం పడగొట్టడం తదితర ఘట్టాలతో పాటు చివరగా ద్రౌపదీ పాండవుల కల్యాణాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోపాల్ అయ్యంగార్, ధర్మకర్తలు పూల సుబ్రమణ్యం నాయుడు, యం. కుమారస్వామి నాయుడు, సిద్ధయ్య నాయుడు, హరిబాబు నాయుడు, రవి నాయుడు, రామచంద్రయ్య, గోవిందయ్య, భక్తులు పాల్గొన్నారు. వారందరికీ కల్యాణోత్సవ అక్షింతలు, తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను ఉత్సవాల నిర్వాహకులు అందజేశారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జేసీ

గుడిపాల, ఏప్రిల్ 4: మండలంలోని వసంతాపురం, గొల్లమడుగు పోలింగ్ కేంద్రాలను గురువారం జేసీ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని గొల్లమడుగు చెక్‌పోస్టు వద్ద తనిఖీలను ముమ్మరం చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐ రామసాయి, కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

కార్వేటినగరం, ఏప్రిల్ 4: కార్వేటినగరం శ్రీలక్ష్మీ నరసింహ హైస్కూల్ 12వ వార్షికోత్సవం గురువారం జరిగింది. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో విజయ్‌కుమార్ సూచించారు. హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పిచ్చి కుక్క వీరంగం

- వృద్ధురాలు సహా ఆవు, మేకను కరిచిన కుక్క



పిచ్చికుక్క కరిచి వృద్ధురాలి చేతికి గాయమైన దృశ్యం

వెదురుకుప్పం, ఏప్రిల్ 4: పిచ్చి కుక్క వీరంగంతో వృద్ధురాలు సహా ఆవు, మేకకు గాయాలయ్యాయి. ఈ ఘటన వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామ పంచాయతీ మర్రిమాకులకండ్రిగ గ్రామంలో జరిగిందని ఆ గ్రామస్తులు గురువారం తెలియజేశారు. పిచ్చికుక్క ఆ గ్రామానికి చెందిన మహాలక్ష్మి(64) అనే వృద్ధురాలి చేతిని కరిచింది. అలాగే ఆ గ్రామంలో ఆవు, మేకను కరిచిందని తెలిపారు. గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

పింఛను దారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సురేంద్ర నాయుడు

ఐరాల, ఏప్రిల్ 4: మండలంలోని పొలకల పంచాయతీలో పింఛను కోసం విచ్చేసిన వృద్ధులకు టీడీపీ నాయకుడు బత్తల సురేంద్ర నా యుడు గురువా రం మజ్జిగ పం పిణీ చేశారు. ఆ యన మాట్లాడు తూ వేసవి కారణంగా ఎండ తీవ్ర త ఎక్కువగా ఉం డటంతో వృద్ధులకు మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించాలని దేవుడిని వేడుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించానన్నారు.

90శాతం పింఛన్ల పంపిణీ

పాలసముద్రం, ఏప్రిల్ 4: పాలసముద్రం మండలంలో 90శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రామనాథ రెడ్డి పేర్కొన్నారు. మండలంలో 3568 మంది పింఛన్‌దారులు ఉండగా, తొమ్మిది సచివాలయాల పరిధిలోని సిబ్బంది 90శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. వికలాంగులు, నడవలేని వృద్ధులకు వారి ఇంటివద్దకు వెళ్ళి సచివాలయ సిబ్బంది పింఛన్లను పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. ఉదయం 6 గంటల నుంచే పింఛన్లను సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు.

నిరుపేద ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ

పుంగనూరు రూరల్, ఏప్రిల్4: నిరుపేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా వాహిద్ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక కొత్తయిండ్లు ఫలాహ్ స్కూల్ ఆవరణలో 150 ముస్లిం కుంటుబాలకు కొత్త దుస్తులు, సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు అబ్దుల్, అలీమ్‌లు మాట్లాడుతూ ఏటా రంజాన్ సందర్భంగా సరుకులు ఆనవాయితీగా ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మహమ్మద్, ఇబ్రహీం, సలీం, కాజా, షఫీఉల్లాఖాన్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలను అరికట్టాలంటే టీడీపీని గెలిపించాలి

● గాలి భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 4: వైసీపీ అరాచకాలను అరికట్టాలన్నా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి పట్టణ పరిధిలోని ఓరుగంటాపురంలో ఇంటింటికెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఓరుగంటాపురం, భీమానగర్, సాల్వపట్టడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల స్టంట్‌కోసం ప్రతిపక్షాలపై సాకు పెట్టి అవ్వా, తాతలకు పెన్షన్ ఇవ్వకుండా ఇబ్బందికి గురి చేసిన జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సైకిల్‌గుర్తుకు ఓటేసి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసన్, బీపీ ఆర్ముగం, అల్లిముత్తు, జ్యోతి నాయుడు, మాణిక్యవాసన్, రాజా, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఓరుగంటాపురంలో భానుప్రకాష్ ఇంటింటి ప్రచారం

సైకిల్ గుర్తుకు ఓటేయండి: టీడీపీ

సైకిల్ గుర్తుకు ఓటేసి నగరి ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మండల టీడీపీ నాయకులు వేలావడి, మునగమాకుల కొత్తూరులో ఇంటింటి కీ వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేసి, ప్రచారం నిర్వహించారు. నగరి మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, రాష్ట్ర టీడీపీ మహిళా అధికారప్రతినిధి మీరా, రాష్ట్ర టీఎస్‌టీయూసీ కార్యదర్శి బాలాజీల ఆధ్వర్యంలో గురువారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తి నాయుడు, బాలసురేష్ నాయుడు, గోపాల్‌శెట్టి, పరంధామ నాయుడు, పురుషోత్తంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

నిండ్ర: టీడీపీ హయాంలోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని తెలుగు రైతు విభాగ జిల్లా మాజీ కార్యదర్శి గంగాధరం నాయుడు అన్నారు. శుక్రవారం గాలి భాను ప్రకాష్‌ను కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, చిట్టిబాబు, మనోజ్‌యాదవ్, రవి కుమార్, గజేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా, పారిశుధ్య పనులను తనిఖీ చేసిన కమిషనర్

చిత్తూరు, ఏప్రిల్ 4: నగరంలోని నీటి సరఫరా, పారిశుధ్య పనులను నగర కమిషనర్ అరుణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కట్టమంచి పరిధిలోని పలు వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. డ్రైనేజీ కాలువలను పరిశీలించిన కమిషనర్ కాలువల్లో పూడికతీత పనులను చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. 4వ వార్డు పరిధిలో నీటి సరఫరాను పర్యవేక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డు అమినిటీ కార్యదర్శి జ్యోతికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. వార్డు స్థాయిలో అప్పగించిన పనులను వార్డు కార్యదర్శులు పక్కాగా నిర్వహించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కమిషనర్ వెంట ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

వలంటీర్లు, పింఛన్లపై సీఎం జగన్ దుష్ప్రచారం: టీడీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 4: వలంటీర్ల వ్యవస్థ, పింఛన్ల పంపిణీపై సీఎం జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ విమర్శించారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం పూతలపట్టులో జరిగిన సభలో సీఎం జగన్ టీడీపీపై నిందలు వేయడం సరికాదన్నారు. జగన్‌కు పాలన చేతకాక టీడీపీపై బురదజల్లే విధంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఈసీ ఆదేశాలను తప్పుదోవపట్టేలా మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. పింఛన్ల పంపిణీని వలంటీర్ల ద్వారా కాకుండా ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని ఈసీ ఆదేశించిందేకాని పింఛన్లు ఇవ్వకూడదని చెప్పలేదన్నారు. ఈ విషయం సామాన్య ప్రజలకు కూడా తెలుసని అన్నారు. జగన్‌రెడ్డి ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ వలంటీర్లకు టీడీపీ తగిన గౌరవం ఇస్తుందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతి సభలోనూ స్పష్టం చేస్తున్నారని పేర్కొన్నారు. ఖజానాలోని డబ్బులు దోచుకుని ఎన్నికలకు వాడుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ కోడికత్తి డ్రామా, వివేకానంద రెడ్డి గొడ్డలి వేటు డ్రామాలు అయిపోయాయని, ఇప్పుడు పింఛన్లు, వలంటీర్లను అడ్డుపెట్టుకుని కొత్త డ్రామాకు తెరలేపారని అన్నారు. పింఛన్ల పంపిణీ సక్రమంగా లేకపోవడంతో అనేకమంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మరణిస్తున్నారని చెప్పారు. ఈ మరణాలకు కారణమైన సీఎం జగన్‌పై హత్య కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, నేతలు కోదండయాదవ్, కాజూరు బాలాజి, సప్తగిరి ప్రసాద్, సప్తగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల వైఫల్యాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ

● ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రవిరాజు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 4: మాతా శిశు మరణాల వైఫల్యాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రవిరాజు తెలిపారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతా శిశు మరణాల నియంత్రణపై గైనకాలజిస్టులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహ వయస్సుపై తప్పకుండా స్కూల్ స్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే టీనేజ్ ప్రెగ్నెన్సీపై, హైరిస్క్ గర్భిణులను త్వరితగతిన గుర్తించి అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు అందించాలన్నారు. హైరిస్క్ కేసుల కాన్పులకు తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను వినియోగించుకోవాలన్నారు. ఆస్పత్రిలోనే కాన్పు అయ్యేటట్లు ప్రోత్సహించాలని, ప్రతి గర్భిణీకి టిఫా స్కాన్ ద్వారా అవసరమైన చికిత్స అందించాలన్నారు. నెలల నిండకుండా కాన్పు అయ్యే బిడ్డలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పుట్టినప్పటి నుంచి వేయాల్సిన వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆదేశించారు. గైనకాలజిస్టులు ఉషశ్రీ, మీనా సయ్యద్, చిన్నపిల్లల వైద్యులు మమత, లత, ఎంసీహెచ్ కోఆర్డినేటర్ జానకిరావు, ఎస్‌వో జార్జ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రవిరాజు

టైఫస్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంవో శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 4: జిల్లాలో టైఫస్ జ్వరాలు వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం డీఎంవో కార్యాలయంలో జిల్లా సబ్ యూనిట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. టైఫస్ జ్వరం మైట్స్ అనే కీటకం (పిడుదలు లాంటివి) కుట్టడం ద్వారా వస్తుందన్నారు. ఈ మైట్స్ అడవుల ద్వారా జంతువులకు, వాటి నుంచి సమాజంలో ప్రజలను కుట్టడం ద్వారా వ్యాపిస్తుందన్నారు. అధిక జ్వరం లాంటిది వచ్చినప్పుడు రక్త పరీక్షలు తప్పనిసరిగా చేయించుకొని, నిర్ధారణ అయితే పూర్తి కాలం చికిత్స తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఆవులు, గొర్రెల ద్వారా సమాజంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో మానిటరింగ్ చేసి ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ప్రతి ఫ్రైడేని డ్రై డేగా పాటించాలన్నారు. ప్రజలకు విరివిగా టైఫస్ జ్వరాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ చెత్తను తొలగించరా?



రోడ్డు పక్కనే చెత్తాచెదారం

కార్వేటినగరం, ఏప్రిల్ 4: ఆర్‌కేవీబీపేట గ్రామ పంచాయతీ కేంద్రంలో ఒంటిల్లుకు వెళ్లే రహదారి పక్కన చెత్తాచెదారం బాగా పేరుకుపోయింది. రోడ్డు పక్కన పేడ దిబ్బలు దర్శనమిస్తున్నాయి. పరిసరాలను పరిశుభ్రం చేయాల్సిన గ్రామ సచివాలయ అధికారులు దీని గురించి పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై గ్రామసభలో ప్రస్తావించినప్పటికీ సచివాలయ అధికారులు పట్టించుకోవడం లేదు.